# ఆదివారం ఆడవాళ్ళు

మధ్యాహ్నం పన్నెండు గంటలైంది. అనురాగ్ అపార్ట్‌మెంట్స్‌లోని ఫ్లాట్స్ లోని ఆడవాళ్లంతా పనిపూర్తి చేసుకొని కాస్త ఊపిరి పీల్చుకొనేసమయం. రమ, జయ, లక్ష్మి, సుమ... ఇంచుమించు ఒకే వయసు వాళ్లవటంతో స్నేహంగా ఉంటారు. మధ్యాహ్నాలు, పనులయాక వీరంతా కలిసి మార్కెట్‌కెళ్లటం, బట్టల షాపింగ్, కుట్లు, అల్లికలతో స్కూలు నుంచి పిల్లలు వచ్చేవరకు కాలం గడుపుతారు. అపుడపుడూ కలిసి సినిమాలకు కూడా వెళుతుంటారు. అందరూ గ్రాడ్యుయేట్స్. కానీ ఉద్యోగాలు చేయటం లేదు.

రమకు ఇద్దరు పిల్లలు. ఒక అబ్బాయి, అమ్మాయి. ఐదు, ఏడు క్లాసులు చదువుతున్నారు. వాళ్లాయన బ్యాంకులో పనిచేస్తారు.

జయకు ఇద్దరు ఆడపిల్లలు. ఏడు, తొమ్మిది క్లాసులు చదువుతున్నారు. వాళ్లాయన ఇంజనీర్.

లక్ష్మికి ఇద్దరు అబ్బాయిలు, ఒక అమ్మాయి. వాళ్లాయనది బిజినెస్.

సుమకు ఒక్కతే అమ్మాయి, ఇంటర్ చదువుతోంది. భర్త ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తారు.

పనవ్వగానే అందరూ బయటకు వచ్చి కబుర్లలో పడ్డారు. వీళ్లందరూ ఈ మధ్య రిలీజ్ అయిన 'ఆదివారం ఆడవాళ్లకు సెలవుకావాలి' సినిమాకు నిన్ననే మాట్నీషోకి వెళ్లివచ్చారు.

జయగారూ సినిమా ఎట్లా ఉందంటారు? నిజంగానే ఆడవాళ్లకు ఆదివారం సెలవు కావాలని నాకూ అనిపిస్తోంది. రోజూ ప్రొద్దున లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకూ ఒకటే పని. ఒక్క రోజన్నా పనినుంచి విముక్తి కావాలి. బాగుంది కదండీ? అంది రమ.

**జి. పద్మావతి**

ఇదే విధంగా లక్ష్మి, సుమల అభిప్రాయాలను కూడా అడిగింది. లక్ష్మి కూడా వారితో ఏకీభవించింది. సుమ ఏమీ మాట్లాడలేదు.

వారంతా సినిమాలో సీన్లు, డైలాగులూ గుర్తు చేసుకొని, వాటి గురించి, అవి ఎలా బాగున్నాయో చర్చించుకుంటున్నారు. పది నిమిషాలు గడిచాయి. అందరూ ఒకటి గమనించారు. అది... సుమ ఏమీ మాట్లాడకపోవటం.

ఏమండీ సుమగారూ... మీరేం మాట్లాడడం లేదు. మీకు సినిమా నచ్చలేదా?

మీరేమనుకోకండీ... నా అభిప్రాయం వేరేగా చెప్తున్నందుకు... అంది సుమ.


సినిమా నాకు కొంచం అవాస్తవికంగా అనిపించింది. ఏదో రెండు గంటలు ఎంజాయ్ చేయటానికి పరవాలేదు కానీ, నిజ జీవితాల్లో అంతలా ఏమీ జరగట్లేదు. ఈ రోజుల్లో మనుషుల మీద మీడియా ప్రభావం చాలా ఎక్కువవుంటోంది. ఈ రోజుల్లో ఆడపిల్లలను తల్లిదండ్రులు బాగా చదివించి, ఉద్యోగాల్లో చేరాక పెళ్లిళ్లు చేస్తున్నారు. పెళ్లయ్యాక ఎటూ తిప్పలు తప్పవు కదా అని పుట్టిళ్లల్లో ఉన్నంతకాలం వాళ్లకు పెద్దగా పనిపాటలు నేర్పటం లేదు. అట్లాంటి వాళ్లమీద ఈ సినిమా ప్రభావం పడిందంటే ఇక వాళ్ల సంసారాలు సరిగా సాగినట్లే... అనేది నా భయం... అంది సుమ.

అంటే మీ ఉద్దేశ్యమేంటి సుమగారూ? ఆడవాళ్లకు ఒక్కరోజైనా పని నుంచి విముక్తి అవసరం లేదంటారా? అందులో తప్పేముంది... మిగిలిన ముగ్గురూ ఒకేసారి అడిగారు.

ఆగండాగండి... నామీద దండయాత్ర చేయకండి. ముందు నేనడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పండి. తరువాత మీకే అర్థమౌతుంది అంది సుమ.

రమగారూ మీ వారికి వంట చేయటం వచ్చా? ఎప్పుడైనా చేశారా?

ఆ... బాగా రాదండీ... నాకెప్పుడైనా జ్వరం వచ్చి లేవలేకపోతే అన్నం, రసం, ఆలూ వేపుడు లాంటివి చేస్తారు. నాకు కూడా ప్లేట్‌లో మంచం మీదకే అందిస్తారు. ఓపిక లేని రోజు టిఫిన్ చేయకపోయినా, సింపుల్‌గా వంట చేసినా సర్దుకుపోతారు. ఏమీ



అనరు... అంది రమ.

లక్ష్మిగారూ... మరి మీవారు?... అడిగింది సుమ.

దగ్గరుండి ఎలా చెయ్యాలో చెప్తే అన్నం వండటం మాత్రమే వచ్చు. కాఫీ మాత్రం బాగా చేస్తారు... అంది లక్ష్మి.

జయగారూ... మరి మీరూ చెప్పండి.

మావారికసలు ఏమీ చేయటం రాదండీ... నాకు కాస్త బాగాలేదంటే చాలు... ఎందుకు అంత కష్టపడటం? ఈరోజుకి హోటలు నుంచి తెచ్చేస్తానంటారు.

అందుకేనండీ మేం చెప్పేది... మనం వారంలో అన్ని రోజులూ పిల్లల్ని, భర్తనీ చూసుకొని, పిల్లల చదువులు, బజారు పన్లు, బిల్లులు కట్టడంతో సహా అన్నీ మనమే చేస్తున్నాం. పైగా ఈ రోజుల్లో ఆడవాళ్లైతే మొగవాళ్లతో సమానంగా ఉద్యోగం చేసి సంపాదిస్తున్నారు. మరి అట్లాంటపుడు వారంలో ఒక్కరోజు పనినుంచి సెలవు తీసుకుంటే ఏమౌతుంది? అన్నారు రమ, జయ, లక్ష్మి ముక్తకంఠంతో.

సరే మీరు చెప్పినట్లు ఆదివారం ఆడవాళ్లకు కంప్లీట్ రెస్ట్ అనుకుందాం. ప్రొద్దున్నే లేచి వాకిలూడ్చి, ముగ్గుపెట్టి, గిన్నెలు తోమి, బట్టలుతికి (పనిమనిషి కూడా ఆడదేకదా? ఆదివారం సెలవు కదా!) వంట చేసి, డైనింగ్ టేబుల్‌మీద అన్నీ అమర్చి, మిమ్మల్ని భోజనానికి పిలిస్తే వెళ్లి భోజనం చేయగలరా? మళ్లీ సాయంత్రం టీ, కాఫీలు, రాత్రి భోజనం... ఇవన్నీ మీరు ఆరోగ్యంగా ఉన్నపుడు మీ భర్త చేస్తుంటే చూస్తూ ఊర్కోగలరా? స్త్రీ ప్రేమమయి. రోజూ భర్త, పిల్లలు చల్లారిన వంటకాలు, బాక్స్‌ల్లోవి తిని ఏదో సర్దుకుపోతుంటారు మరో దారిలేక. అందుకని ఆదివారం భర్తకు, పిల్లలకు ఇష్టమైనవి వేడివేడిగా వండిపెట్టి, తినిపించి తృప్తి పడుతుంది.

ఈ సృష్టికి మూలం ఆదిశక్తి. ఈ సమాజంలో స్త్రీకి ఒక ప్రత్యేకస్థానం ఉంది. స్త్రీకి భూమికున్నంత ఓర్పు, సహనం, నేర్పు ఉన్నాయి.


మగవాడు అర్భకుడు. స్త్రీకి ఉన్నంత ఓర్పు, నేర్పు లేవు. అందువల్ల భార్య అనే స్త్రీ మీద ప్రతి చిన్న పనికి, సలహాకీ ఆధారపడతాడు. పిల్లల్ని తీర్చిదిద్దటంలో భార్య నేర్పరితనంవల్లనే, వాళ్ల పెంపకం, చదువు, సంసార బాధ్యతలు... అన్నీ భార్యమీద వదిలేసి నిశ్చింతగా ఉంటాడు.

ఇందువల్లే చాలామంది అత్తగారి స్థానంలో ఉన్న ఆడవాళ్లు (తామూ ఒకప్పటి కోడళ్లేనని మరచి) పెళ్లవగానే తమ కొడుకు మారిపోయాడు. పెళ్లాం కొంగు పట్టుకు తిరుగుతున్నాడంటారు.

మీరు మన పెద్దలు చెప్పింది వినే వుంటారు. భార్యకు పెద్దలు చెప్పిన అర్థం... కార్యేషు దాసి, కరణేషు మంత్రి, భోజ్యేషు మాతా, శయనేషు రంభా.

చెప్పాలంటే మగవాడు మానసికంగా ఆడవాళ్లకంటే చాలా బలహీనుడు. అందువల్ల తన సంసారం... పిల్లలు, బాధ్యతలు భార్యమీద వదిలేసి నిశ్చింతగా, ఆనందంగా గడుపుతాడు. అదే మగవాడు భార్య అనారోగ్యంతో బాధ పడుతూంటే సేవలు చేస్తాడు. కాదంటారా?

మరి ఈ రోజుల్లో ఉద్యోగాలు చేసే ఆడవాళ్లు మగవాళ్లతో సమానంగా అన్ని రోజులూ పని చేస్తున్నారు. వాళ్లకి కనీసం ఒక్క రోజైనా సెలవొద్దా? అన్నారు జయ, రమ, లక్ష్మి... వాళ్ల వాదనని వదులుకోవటం ఇష్టం లేక.




మరి ఉద్యోగం చేసే మగవాళ్ల సంగతేమి టి? వారంలో వారికి ఒకరోజు ఉద్యోగానికి సెలవు అయితే ఇంటిలో పని చేయమనా? వారూ ఒకరోజు పూర్తిగా సెలవు కావాలంటే ఇక పనిచేసేదెవరు?

సరే... చూడండి. 402 లో ఉన్న స్నేహ, వాళ్లాయన ఇద్దరూ బ్యాంకు ఉద్యోగస్తులే. కాకపోతే వేరు వేరు బ్యాంకులు. వాళ్లకిద్దరు పిల్లలు. వాళ్లాయన పిల్లల పన్లు... అంటే యూనిఫారంలు ఇస్త్రీ, వాటర్ బాటిల్స్, టిఫిన్ బాక్స్‌లు తయారుచేసి భార్యకు సహాయం చేస్తారు. స్నేహ ఇంటి పని, వంటపని, పిల్లల స్నానాలు చూసుకుంటుంది. ఇవన్నీ రోజూ మనం చూస్తూనే ఉన్నాము. ఇద్దరూ కలిసి పిల్లల్ని స్కూలులో దింపి, ఆఫీసులకు వెళ్లిపోతారు. భార్యా భర్తలిద్దరూ ఉద్యోగస్తులైతే తప్ప కుండా భర్తలు సహాయం చేస్తున్నారు. సహాయం చేయక, భార్య ఆరోగ్యం దెబ్బతింటే అపుడేం చేస్తాడు. మగవాడు అంత మూర్ఖుడేం కాదు... పైగా భార్య శత్రువు కాదుకదా? ఏరి కోరి చేసుకున్న సహధర్మచారిణి. కలిసి మెలిసి జీవిస్తేనే సుఖం, సంతోషం.

కాని మీరు చెప్పినట్లు కూడా కొన్ని చోట్ల జరుగుతోంది. కానీ అవి నూటికొకటో, కోటికొకటో.

అంత శక్తివంతమైన ఆడది ఒకరోజు సెలవు కావాలి అని దేబిరించటం, అది వేరెవరినుంచో పొందాల్సిన హక్కులాగా సమ్మె చేయటం నాకేం నచ్చలేదు. సర్వంతానే అయి సంసారాన్ని నడిపించి, తన మంచితనంతో, నేర్పరితనంతో భర్తని తన కొంగుకు ముడేసుకొని, తన కనుసన్నలలో నడిపించగల శక్తిగల ఆడది నాకొకరోజు సెలవు కావాలని దేబిరించటమేమిటి? ప్రేమతో, నేర్పుతో భర్తని తనకు అనుకూలంగా మలచుకోవచ్చు అని తన అభిప్రాయాన్ని సుమ వాళ్ల ముందుంచింది.

అంతా విన్న స్నేహితులు సుమ మాటలనే ఆలోచిస్తూ, పిల్లలొచ్చే సమయం కావటంతో, టిఫిన్‌లు రెడీ చేయటానికి ఎవరి ఫ్లాట్‌లోకి వాళ్లెళ్లిపోయారు.